అందరి ఆరోగ్యమే లక్ష్యం

- ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యం
- 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో పేదలకు ఎంతో మేలు
- వైద్య శిబిరాల సందర్శనలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



34వ వార్డు కొబ్బరితోట యూపీహెచ్‌సీలో కంటి వైద్య పరీక్షల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



వైద్య శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

దాబాగార్డెన్స్: అమ్మా ఎలా ఉన్నారు.. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మీకు వైద్య సేవలందుతున్నాయా?.. ఆరోగ్యపరంగా మీ సమస్యలు వైద్యులు తెలుసుకుంటున్నారా?.. మీకు సరైన వైద్యం అందిస్తున్నారా?.. వలంటీర్లు మీ ఇంటికి వచ్చి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్నారా?.. మరీ ముఖ్యంగా వైద్య పరీక్షల అనంతరం మీకు ఉచితంగా మందులు ఇస్తున్నారా.. అంటూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అడిగి తెలుసుకున్నారు. దక్షిణ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సోమవారం ఆయన విజిట్ చేశారు. ఆరోగ్య సురక్ష కేంద్రాలకు వచ్చిన ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయో ఆరా తీశారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రజల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు.

ఎమ్మెల్యే విజిట్ సాగిందిలా..

ఉదయం 9 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరారు. 10 గంటలకు తాడివీధి అంబేడ్కర్ కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి చేరుకున్నారు. కేంద్రం వద్ద అధిక సంఖ్యలో ఉన్న పేషెంట్లతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేని పేదల కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. రోగులకు మంచి వైద్యం అందించాలని, ప్రధాన ఆస్పత్రులకు రిఫర్ చేయాలని వైద్యులకు సపూచించారు. అనంతరం 34వ వార్డు కొబ్బరితోట తదితర ప్రాంతాల్లోని యూపీహెచ్‌సీల్లో జరిగిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించి వైద్య సేవల తీరు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా ఊహకు కూడా అందని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతోందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, జీవీఎంసీ, కలెక్టరేట్ సిబ్బంది ప్రతి గడపకు వెళ్లి అవసరమైన వారికి మంచి వైద్యం అందించడమే ఆరోగ్య సురక్ష ఉద్దేశమన్నారు. సుగర్, బీపీ, థైరాయిడ్, కంటి వైద్య పరీక్షలు, ఊపిరితిత్తుల పరీక్షలు తదితర ముఖ్యమైన వైద్య పరీక్షలు చేసి మన తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని కాపాడుతున్న దేవుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ఆరోగ్యశ్రీ పథకంలో లేని వైద్యాన్ని పొందేందుకు తమ దృష్టికి తెస్తే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉచితంగా అందించేలా సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షతో ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా ప్రజలకు చేరువ చేస్తున్న ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

జగదాంబ: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల వైపు జనం పరుగులు తీస్తున్నారని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. సోమవారం వార్డులోని ప్రసాద్ గార్డెన్స్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండా వీధి, గాజుల వీధి సచివాలయం పరిధిలో ప్రజలకు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి వద్దకే వైద్యం పేరుతో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు బాసటగా నిలుస్తోందన్నారు. ప్రజారోగ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. అవసరమైన వారికి మరింత మెరుగైన వైద్యం అందించేందుకు కార్పొరేట్ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. వైద్య శిబిరంలో 618 మంది రోగులు పలు రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 147 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం ముగ్గిరిని కేజీహెచ్‌కు తరలించారు. వారి వ్యాధి తీవ్రతను బట్టి కార్పొరేట్ ఆస్పత్రికి తరలిస్తారని వైద్యుడు సందేష్ తెలిపారు. కార్యక్రమంలో గృహసారథులు,కనీవ్వనర్లు, ఏఎన్ఎంలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



30వ వార్డు ఆరోగ్య సురక్ష శిబిరంలో పరీక్షల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి



ప్రసాద్ గార్డెన్స్ ఆరోగ్య కేంద్రంలో కేస్ షీట్లు అందిస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు



జగనన్న ఆరోగ్య సురుక్ష వైద్య శిబిరంలో డాక్టర్ వినీలా, వైద్య సిబ్బంది

వైద్య శిబిరాలు ఉపయోగకరం

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి పేద ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ తెలిపారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సచివాలయం పరిధిలోని వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినీలా, తదితర సిబ్బంది శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి వైద్యశిబిరాలు ప్రతి ఆరు నెలలకు నిర్వహిస్తే రాష్ట్ర ప్రజలకు ఎంతోగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



తారకరామా కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం: ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి కోరారు. మీ ఇంటికి మీ కార్పొరేటర్ కార్యక్రమాన్ని సోమవారం నుంచి అచ్చియ్యమ్మపేట సచివాలయం పరిధి తారకరామా కాలనీలో ఆమె చేపట్టారు. ఇందులో భాగంగా సచివాలయ వలంటీర్ పరిధిలోని 50 ఇళ్లకు ఆమె స్వయంగా వెళ్లి వారితో మమేకమయ్యారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలు పరిష్కారమే తన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి సేవ చేసే అవకాశం



జాన్‌వెస్లీని అభినందిస్తున్న క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతినిధులు

సీతంపేట: ఏపీ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా రెండో సారి పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీని క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల క్రిస్టియన్ మైనార్టీ ఫోరం నాయకుడు శామ్యూల్ అరుణ్ కుమార్ కలిసి ప్రార్థనలు చేసి దైవ ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తనపై ఉన్న అపారమైన నమ్మకంతో మళ్లీ క్రైస్తవ సమాజానికి సేవ చేసే భాగ్యం కల్పించారన్నారు. రెవరెండ్ డాక్టర్ మిస్సాల మోజస్ ఎలీషా, అహతరోన్ రాజ్, ప్రవీణ్, రెవరెండ్ కాకర సత్య మనోహర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలుష్య రహిత విశాఖ లక్ష్యం



జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో వెళ్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి కోరారు. కాలుష్య నిర్మూలనలో భాగంగా మేయర్ సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్య రహిత విశాఖ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. నగర ప్రజలు సాధ్యమైనంత వరకు ప్రజా రవాణాన్ని ఉపయోగించాలని, కాలుష్య రహిత వాహనాలు వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు కోడిగుడ్ల పంపిణీ



విద్యార్థులకు బాయిల్డ్ ఎగ్స్ అందిస్తున్న నెక్ జోనల్ వీసీ రామకృష్ణారెడ్డి

మహారాణిపేట: నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ(నెక్) వ్యవస్థాపకుడు డాక్టర్ బి.వి.రావు 88వ జయంతి సందర్భంగా సోమవారం పలు ప్రాంతాల్లో కోడిగుడ్లు పంపిణీ చేశారు. సీతంపేట ప్రాథమిక పాఠశాలలో నెక్ జోనల్ వైస్ చైర్మన్ ఎస్.రామకృష్ణారెడ్డి, నెక్ కార్యవర్గ సభ్యుడు బి.రామారావు, మెడికల్ రిప్రజెంటేటివ్ ఎం.వి.అరవింద్ తదితరులు విద్యార్థులకు బాయిల్డ్ ఎగ్స్ అందజేశారు. సబ్బవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నెక్ జోనల్ చైర్మన్ టి.యు.భాస్కర్ బాయిల్డ్ ఎగ్స్ పంపిణీ చేశారు. పరవాడ ఎంపీపీ హైస్కూల్‌లో విద్యార్థులకు నెక్ కమిటీ నాయకులు కె.గంగి రెడ్డి, ఎం.శివరామకృష్ణ, టి.శ్రీధర్, ఎం.సాంబశివరావు తదితరులు కోడిగుడ్లు అందించారు. రణస్థలం ఎంపీపీ స్కూల్, దేవరాపల్లి పాఠశాలలో కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఈసీ సభ్యుడు బి.రామారావు, ఏపీ పౌల్ట్రీ సమాఖ్య నార్త్ ఆంధ్రా రీజినల్ చైర్మన్ బి.సాయినాథురావు, ఇతర ప్రముఖులు పి.శేషగిరిరావు, జి.అప్పారావు, జి.దుర్గారావు, బి.శరత్, బి.శ్రీనివాస్, ఎ.శివప్రసాద్, బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

8న విద్యా సంస్థల బంద్‌కు మద్దతు

అల్లిపురం: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌కు పలు ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద, జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అఖిల పక్ష కార్మిక ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో పోరాటం మొదలుపెట్టి నవంబర్ 8వ తేదీ నాటికి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా సంఘీభావంగా విద్యా సంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రజా సంఘాలు తెలిపాయి. ఈ మేరకు జగదాంబ వద్ద గల సీఐటీయు కార్యాలయంలో సోమవారం అఖిల పక్ష కార్మిక సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా సంస్థల బంద్‌కు అఖిల పక్ష సమావేశంలో సంఘీభావం తెలియజేస్తున్నట్టు చెప్పారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేసి, సంప్రదించవచ్చు.

ఏవీఎన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేత ట్రోఫీ అందుకుంటున్న ఏవీఎన్ కాలేజీ మహిళా జట్టు

దాబాగార్డెన్స్: ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో ఏవీఎన్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. బాస్కెట్‌బాల్ మహిళా విభాగం పోటీల్లో ఏవీఎన్ కళాశాల టీమ్ విజేతగా నిలిచింది. డిగ్రీ విద్యార్థినులు పోటీలో పాల్గొని ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ గోపీకృష్ణ శిక్షణలో విజయం సాధించిన టీమ్‌కు ఏయూ నేక్ బృందం అభినందించింది.

నేవీ మారథాన్‌లో మేరీగ్రేస్..

నేవీ మారథాన్‌లో కళాశాల విద్యార్థిని, అథ్లెట్ మేరీ గ్రేస్ ప్రథమ స్థానంలో నిలిచింది. 10 కిలోమీటర్ల మహిళా విభాగంలో ఆమె ఫస్ట్ ప్లేస్ సాధించింది. వరుసగా నాలుగు సార్లు నిర్వహించిన పోటీల్లో మొదటి స్థానాన్ని సాధించిన మేరీగ్రేస్ 4 గోల్డ్ మెడల్స్, 50 వేల క్యాష్ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు బాస్కెట్‌బాల్ టీమ్‌ను, మేరీగ్రేస్‌ను అభినందించారు.

న్యాయం చేయాలని నిరసన



పోలీస్ కమిషనరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న మనోజ్ కుటుంబ సభ్యులు

అల్లిపురం: తన కుమారుడు బొల్లంకి మనోజ్‌ను అన్యాయంగా చంపేసి, కార్ యాక్సిడెంట్‌గా చిత్రీకరించారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ న్యూ రేసపువానిపాలేనికి చెందిన బొల్లింకల వరలక్ష్మి, బొల్లింకల వెంకటరమణ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసనకు దిగారు. పోలీసులు వారిని స్పందన కార్యక్రమానికి పిలిపించి మాట్లాడారు. బాధితుల కథనం ప్రకారం.. గత సెప్టెంబర్ 23వ తేదీ రాత్రి వినాయక నిమజ్జనం నిమిత్తం మనోజ్‌ను స్నేహితులు తారక్, ఢిల్లీలు ఇంటి నుంచి తీసుకెళ్లారని, ఉదయం వరకు ఇంటికి రాలేదని పేర్కొన్నారు. ఉదయం ఢిల్లీ తమ ఇంటికి వచ్చి మీ అబ్బాయి కేజీహెచ్‌లో ఉన్నాడని చెప్పి తీసుకెళ్లగా.. అక్కడ తన కుమారుడు విగతజీవిగా పడిఉన్నాడని, ఏం జరిగిందని అడగ్గా.. వీఐపీ రోడ్డులో ఓ కారు మనోజ్‌ను ఢీకొని వెళ్లిపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లామని చెప్పారన్నారు. తమ అబ్బాయి ఇంటికి దగ్గరలో గల ఒక అమ్మాయితో చనువుగా ఉండటంతో యువతి పెదనాన్నతో కలిసి చంపేసారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మూడో పట్టణ పోలీసులతో తమ అనుమానాన్ని వెల్లడించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకోసమే తమకు న్యాయం చేయాలని సీపీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టామని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



30వ వార్డు తాడివీధికి చెందిన పట్నాల దివాకర్‌కు రూ.6 లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



39వ వార్డు థామ్సన్ స్ట్రీట్‌కు చెందిన అనూషకు రూ.35 వేల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం రూ.9 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. 30వ వార్డు తాడివీధిలో నివసిస్తున్న పట్నాల దివాకర్ కిడ్నీ సమస్యతో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్నారు. తనకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు విడుదల చేయాలని ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి రూ.6 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించారు. ఆ చెక్కును లబ్ధిదారుకు అందజేశారు.

- 27వ వార్డు ఆశీల్‌మెట్టకు చెందిన సంకిలి సుందరరావు నరాల బలహీనత, కిడ్నీ సమస్యలతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్నాడు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రీయింబర్స్‌మెంట్ ఇప్పించాలని విజ్ఞప్తి మేరకు రూ.1.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు.
- 32వ వార్డు నేరెళ్లకోనేరు ప్రాంతానికి చెందిన జిల్లెల లక్ష్మీ పైడికొండ గుండె జబ్బుతో బాధపడుతోంది. ఆమెకు రూ.70వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిచారు.
- 39వ వార్డు నల్లావారి వీధిలో నివసిస్తున్న కారి పైడికొండ డెంగ్యూ ఫీవర్‌కు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఈ మేరకు ఆమెకు రూ.35వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. అలాగే 39వ వార్డు థామ్సన్ వీధికి చెందిన సూరాడ అనూషకు రూ.35వేలు, 30వ వార్డు మంతావారి వీధికి చెందిన క్రాలేటి సంధ్యకు రూ.25 వేల చెక్కు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అందజేశారు.

'రెడ్ క్రాస్' మురళికి ఘన సత్కారం



ఆవాల మురళికి జ్ఞాపిక అందజేసి అభినందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: అనేక సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించే రెడ్ క్రాస్ హోంలెస్ షెల్టర్ మేనేజర్ ఆవాల మురళికి ఘన సత్కారం జరిగింది. సోమవారం కేజీహెచ్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విశాఖ చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్ర రెడ్డి, కార్యదర్శి పి.రవికుమార్ సమక్షంలో మురళికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జ్ఞాపిక అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆస్పత్రి అడిషనల్ సీఎంవో డాక్టర్ అరుణాదేవి, సీఎస్సార్ ఎంవో డాక్టర్ వాసుదేవ, రెడ్‌క్రాస్ విశాఖ జిల్లా కో ఆర్డినేటర్ సంతోష్, అవంతి, కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాలు

మహారాణిపేట: హిందూజా పవర్ ప్లాంట్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వాసితులు ధర్నా చేశారు. 2015లో ఉద్యోగాలు ఇస్తామంటే భూములిచ్చామని, నేటి వరకు ఇవ్వలేదని వాపోయారు. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు కాకుండా ఇతరులకు ఉద్యోగాలు ఇవ్వడం అన్యాయమన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

◆ తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సఖీ–వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. 2017 జూన్ నుంచి వన్‌స్టాప్ వన్ సెంటర్‌లో 18 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, వివిధ సమస్యలతో సతమతమవుతున్నారని, కొద్ది నెలలుగా జీతాలు కూడా రావడం లేదని యూనియన్ నాయకురాలు మణి తెలిపారు. జీతాలు విడదల చేయాలని కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

◆ తాటిచెట్లపాలెం ఏఎస్సార్ నగర్‌లో రేకుల షెడ్డులో నివసిస్తున్న తమకు ఇళ్లు ఇప్పించాలని పలువురు కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం స్పందనలో దరఖాస్తు చేశారు. 2018 నుంచి ఏఎస్సార్ నగర్‌లోని షెడ్డుల్లో నివసిస్తున్నామని, ఆ తర్వాత తమ ఇళ్లు ఖాళీ చేయించారని, బాధితులకు ఏపీ టిడ్కో హౌసింగ్‌లో ఇళ్లు ఇవ్వాలని వారు కోరారు.

రైళ్లలో పేలుడు పదార్థాల రవాణా నేరం

తాటిచెట్లపాలెం: ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించేటపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడు, మండే స్వభావం గల పదార్థాలను తమతో తీసుకువెళ్లరాదని, ఇది ప్రమాదకరమని, శిక్షార్హమైన నేరమని వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టపాసులు, గ్యాస్ సిలిండర్స్, ఏసిడ్, కిరోసిన్, పెట్రోల్ వంటి వాటిని రైళ్లలో, రైల్వే స్టేషన్లలోనికి తీసుకురావడం రైల్వే యాక్ట్ 1998 ప్రకారం నేరమని, ఇలా చేసిన వారికి మూడేళ్ల వరకు జైలు, జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. దీపావళి సమీపిస్తున్న తరుణంలో వాల్తేర్ డివిజన్ వీటికి సంబంధించి ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరితోపాటు సివిల్ డిఫెన్స్ సభ్యులు, టీటీఈలు, కోచ్ అటెండెంట్స్, ట్రైన్ మేనేజర్స్, స్టేషన్ మేనేజర్లు కూడా తరచూ తనిఖీలు చేపడతారన్నారు. ప్రయాణికుల సహాయం కోసం 139 నంబర్‌ను సంప్రదించాలని త్రిపాఠి కోరారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్.. ◆ బెంగళూరులో మంగళవారం ఉదయం 10.15కు బయల్దేర వలసిన బెంగళూరు–అగర్తలా(12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ 24 గంటలు ఆలస్యంగా బుధవారం ఉదయం 10.15 గంటలకు బయల్దేరుతుంది.

◆ అలెప్పీలో మంగళవారం ఉదయం 6 గంటలకు బయల్దేరాల్సిన అలెప్పీ–ధన్‌బాద్ (13352) బొకారో ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.45కు బయల్దేరుతుంది.

'ప్రజా రక్షణ భేరి' విజయవంతానికి పిలుపు

అల్లిపురం: రాష్ట్రంలో అసమానతలు లేని సమాజం, రాష్ట్ర అభివృద్ధి కోసం నవంబర్ 15న విజయవాడలో జరగనున్న సీపీఎం బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. సోమవారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలపైన, కార్మికులపైన పెద్ద ఎత్తున ఆర్థిక భారం మోపుతోందన్నారు. 15న విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో మహా ప్రదర్శన ప్రారంభమై ఎంబీ స్టేడియం వరకు సాగుతుందన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం 500 మంది బైక్ యాత్రగా వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, కేఎం శ్రీనివాస్, బి.పద్మ, బి.ఈశ్వరరావు, బి.జగన్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాసంకల్ప యాత్ర ఆరేళ్ల వేడుక



గోవింద్ రోడ్డులో కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట రమణారెడ్డి



కేక్ కట్‌చేసి ఎమ్మెల్యే వాసుపల్లికి తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజీవ్‌గాంధీ

దాబాగార్డెన్స్: పేదల కష్టాలు తెలుసుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కార్యాలయంలో సోమవారం సంబరాలు జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పక్షనేత హోదాలో ప్రజా సంకల్పయాత్రకు శ్రీకారం చుట్టి ఆరేళ్లయ్యిందన్నారు. పాదయాత్రలో తెలుసుకున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, అనుభవాలను మేనిఫెస్టోగా రూపొందించి 2019 ఎన్నికల్లో భారీ మెజారీతో విజయం సాధించి అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను రెండేళ్లలో 90 శాతం, నాలుగున్నరేళ్లలో 99 శాతం అమలు చేసిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా భావించి సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, కార్పొరేటర్లు, పలు వార్డుల అధ్యక్షులు, మండల ప్రెసిడెంట్స్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం: స్థానిక గోవింద్ రోడ్డులో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నీలాపు వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, పార్టీ నాయకులు బొడ్డేటి ప్రసాద్, కణితి బ్రహ్మం, కొడమంచిలి శ్రీను, కణితి బ్రహ్మం, పిల్లి శివ, పెంటకోట కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోటీతత్వంతో పిల్లల్లో సృజనాత్మకత



విజేత చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

దాబాగార్డెన్స్: చదువుతో పాటు పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీయడంలో భాగంగా జూనియర్ మోడల్ పోటీలు నిర్వహించిన క్వీన్ ఈవెంట్స్ నిర్వాహకురాలు ఉషారాణిని సీనియర్ సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు అయినవోలు ప్రసన్న కుమార్ అభినందించారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించిన జూనియర్ మోడల్ సీజన్ 3 ఫైనల్ పోటీలను ఆయన తిలకించారు. అనంతరం విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కల్చరల్ పోటీలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 3 కేటగిరీల్లో 120 మంది పిల్లలు పాల్గొనగా, 50 మందిని ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సినీ దర్శకుడు దుగాన జగదీష్ పోటీలో గెలుపొందిన పిల్లలకు తన తదుపరి చిత్రంలో అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మాధురి, శ్రీలత, దివ్య, జ్యోతి, గీత, పద్మశ్రీ, అంజలి, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మల్లికార్జున, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరాలకు జనాల నుంచి స్పందన బాగుందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ మూర్తి, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎం.పోలినాయుడు, డీఎల్ డీవో పూర్ణిమాదేవి, తదితరులు పాల్గొన్నారు.